

ప్రశాంతంగా ప్రిలిమినరీ రాత పరీక్ష

పోలీస్ కానిస్టేబుల్స్ నియామకం కోసం ఆదివారం జిల్లా వ్యాప్తంగా 52 పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించారు. అత్యంత పకడ్బందీగా పరీక్షలు నిర్వహించారు.

8లో



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.58,630
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.5,237
3 శాతం జీఎస్టీతో	రూ.5,394
నవర (8 గ్రా)	రూ.43,152

గరిష్టం/కనిష్టం
30.5 /22.0

వాతావరణం

జిల్లా వ్యాప్తంగా సోమవారం వాతావరణం పొడిగా ఉంటుంది. గరిష్ట, కనిష్ట ఉష్ణోగ్రతలు గణనీయంగా తగ్గడంతో చలి పెరిగింది. గాలిలో తేమ 65 శాతం ఉంది.

న్యూస్‌రీల్

జిల్లా స్థాయి ఆర్చరీ ఎంపికలు నేడు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి ఆర్చరీ ఎంపికలు సోమవారం జరగనున్నాయని ఫెడరేషన్ జిల్లా సెక్రటరీ ఎస్. విజయ ఆదివారం తెలిపారు. ఈ ఎంపికలు ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఉదయం 10 గంటలకు అండర్–14, 17 విభాగాల్లో బాలబాలికలకు ఇండియన్ రికర్వ్, కాంపౌండ్ విభాగాల్లో నిర్వహిస్తున్నట్లు ఆయన వివరించారు. జిల్లా స్థాయిలో ఎంపికైౖ క్రీడాకారులు ఈ నెల 30వ తేదీ నుంచి విశాఖపట్నంలో జరగనున్న స్టేట్ ఆర్చరీ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటారని వివరించారు. వివరాల కోసం 99485 51484 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

ఆర్‌ఎస్‌ఐ భార్య ఆత్మహత్యాయత్నంపై విచారణ

నెల్లూరు (క్రైమ్): ఆర్‌ఎస్‌ఐ భార్య ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటనపై ఆదివారం దర్గామిట్ట పోలీసులు విచారణ చేపట్టారు. ఆమె స్టేట్‌మెంట్‌ను రికార్డు చేసినట్లు తెలిసింది. సేకరించిన సమాచారం మేరకు.. జిల్లాలో పని చేస్తున్న ఓ ఆర్‌ఎస్‌ఐ గతేడాది ఒక యువతిని ప్రేమవివాహం చేసుకున్నాడు. వారి మధ్య విభేదాలు పొడచూపినట్లు తెలిసింది. దీంతో ఆమె 15 రోజులుగా నారాయణ ఇంజినీరింగ్ కళాశాల సమీపంలోని ఓ లేడీస్ హాస్టల్‌లో ఉంటున్నారు. ఈ నెల 21వ తేదీన ఆమె తన భర్తతో బయటకు వెళ్లారు. తిరిగి వచ్చే ముందు నిద్ర మాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి ఒడిగట్టడం, హాస్టల్ నిర్వాహకులు బాలాజీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేయడం, పోలీసులు చికిత్స నిమిత్తం ఆమెను జయభారత్ హాస్పిటల్‌లో చేర్పించిన విషయం విదితమే. పోలీసుల విచారణలో ఆమె ఇస్కాన్‌సిటీలోని భర్త గది వద్దనే ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు తేలడంతో కేసు దర్గామిట్ట పోలీసుస్టేషన్‌కు చేరింది.

సోమశిలలో 70.831 టీఎంసీలు



సోమశిల: సోమశిల జలాశయంలో ఆదివారం నాటికి 70.831 టీఎంసీలు ఉన్నాయి. జలాశయానికి 918 క్యూసెక్కుల వంతున వరద వచ్చి చేరుతోంది. పెన్నార్ డెల్టాకు 2,520, ఉత్తరకాలువకు 550, దక్షిణకాలువకు 320, కండలేరుకు 50 క్యూసెక్కుల వంతున విడుదల చేస్తున్నారు.

పది పురోగామి

పదో తరగతి ఫలితాలపై జిల్లా విద్యాశాఖ దృష్టి సారించింది. విద్యార్థుల సామర్థ్యాన్ని పెంచి పదిలో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు 63 రోజుల 'పురోగామి' ప్రణాళికను రూపొందించారు. సిలబస్‌ను పది భాగాలు విభజించి పునశ్చరణ తరగతులు నిర్వహించడంతో పాటు ప్రతి రోజూ స్లిప్ టెస్ట్‌లు పెట్టి విద్యార్థుల సామర్థ్యాన్ని అంచనా వేసి తదనుగుణంగా వారిని తీర్చిదిద్దనున్నారు. గతంలో ఇలాంటి వంద రోజుల ప్రణాళికతో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యాశాఖ ఈ ఏడాది వెనుకబడింది.



నెల్లూరు జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో పది విద్యార్థులు



ఉత్తమ ఫలితాలు సాధించేలా నేటి నుంచి 63 రోజుల ప్రణాళిక

- 27న జెడ్పీ విద్యార్థులకు మెటీరియల్ పంపిణీ
- ఈ నెలాఖరు కల్లా సిలబస్ పూర్తి
- అనంతరం ప్రతి రోజూ పునశ్చరణ తరగతులు, టెస్ట్‌లు
- వెనుకబడిన విద్యార్థులను ఉపాధ్యాయుల దత్తత
- పిల్లల సామర్థ్యంపై ఇళ్లకు వెళ్లి తల్లిదండ్రులతో చర్చ
- ఏప్రిల్ 3 నుంచి 18వ తేదీ వరకు పరీక్షలు

నెల్లూరు (టౌన్): పదో తరగతి విద్యార్థులకు సోమవారం నుంచి పురోగామి ప్రోగ్రాంను అమలు చేయనున్నారు. ప్రణాళిక ప్రకారం పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ఈ నెలాఖరుకు సిలబస్ పూర్తి చేసి అనంతరం పునశ్చరణ తరగతులు నిర్వహించాలని నిర్ణయించారు. గతేడాది పదో తరగతి ఫలితాల్లో 66.56 శాతమే ఉత్తీర్ణత సాధించడంతో రాష్ట్రస్థాయిలో జిల్లా ర్యాంకింగ్ స్థాయి పాతాళానికి పడిపోయింది. గతంలో వంద రోజుల ప్రణాళికతో విద్యార్థులను పరీక్షలకు సంసిద్ధం చేసిన విద్యాశాఖ ఈ ఏడాది ఈ ప్రణాళిక అమలు ఆలోచనే చేయలేదు. ఆర్జేడీనే ఇన్‌చార్జి డీఈఓగా ఉండడంతో పట్టించుకున్న నాథుడే లేకుండా పోయారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి ఫలితాలపై జిల్లా విద్యాశాఖాధికారుల తీరుపై ఈ నెల 11న సాక్షిలో 'పదిపై గురి పెట్టని విద్యాశాఖ' శీర్షికతో కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన జిల్లా విద్యాశాఖ పది విద్యార్థుల కోసం పురోగామి ప్రోగ్రాంను రూపొందించారు. ఇప్పటికే సమయం మించిపోవడంతో ఈ ఏడాది కేవలం 63 రోజుల ప్రణాళికకు కుదించారు. ఈ ఏడాది ఉత్తీర్ణత శాతాన్ని పెంచేందుకు ప్రతి పాఠశాల హెడ్‌మాస్టరుతో పాటు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకునే విధంగా జిల్లా విద్యాశాఖ అధికారులు ప్రణాళికను తయారు చేశారు. వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని సూచించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు జిల్లా పరిషత్ యాజమాన్యం ప్రత్యేక మెటీరియల్‌ను అందజేస్తున్నారు.

ప్రణాళిక ఇలా

పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు జిల్లా విద్యాశాఖ అధికారులు పురోగామి పేరుతో ప్రణాళికను రూపొందించారు. ఈ షెడ్యూల్ ప్రకారం నుంచి ప్రతి పాఠశాలలోని హెడ్‌మాస్టరు, ఉపాధ్యాయులు అనుసరించాల్సి ఉంది.

- ఈ నెల 23వ తేదీ నుంచి ప్రతి రోజు రెండు పరీక్షలు నిర్వహించాల్సి ఉంటుంది.
- ఈ నెల 31వ తేదీ కల్లా అన్ని పాఠశాలల్లో సిలబస్‌ను పూర్తి చేయాలి.
- అదే రోజు పాఠశాలలో పది విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించి వారి పిల్లల విద్యా స్థితి, తల్లిదండ్రుల బాధ్యత గురించి తెలియజేశాలి.
- పునశ్చరణ తరగతులతో పాటు ప్రతి రోజు రెండు సబ్జెక్ట్‌ల్లో (25 మార్కులు చొప్పున) పరీక్ష నిర్వహించాలి.
- సిలబస్ మొత్తాన్ని 10 సమ భాగాలుగా విభజించి దీనిని 10 విడతల్లో పరీక్షలు నిర్వహించాలి.
- పరీక్షలకు సంబంధించి ప్రశ్నపత్రాలను డీఈఓ వెబ్‌సైట్‌లో ఉంచుతారు. వాటిని గంట ముందుగా డౌన్‌లోడ్ చేసుకుని విద్యార్థులకు అందజేయాలి.
- సమాధాన పత్రాలను తరగతి ఉపాధ్యాయులే మూల్యాంకనం చేసి విద్యార్థులు ఫలితాలను బట్టి వారికి సూచనలు, సహకారం అందించి సామర్థ్యాల పెంపునకు కృషి చేయాలి.
- ఒక్కో విడత పరీక్షల అనంతరం ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయుడు కలిసి విద్యార్థులతో సమీక్ష సమావేశం నిర్వహించాలి.
- ఒక్కో విడత పరీక్షల్లో విద్యార్థుల ప్రగతిని నమోదు చేసి పాఠశాల రిపోర్టు కార్డును సంబంధిత ఉప విద్యాశాఖాధికారికి అందజేయాలి.
- పది విద్యార్థుల సామర్థ్యాలపై డిప్యూటీ డీఈఓలు వారి డివిజన్లల్లో టెలీకాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష చేయాలి.
- ఈ పరీక్షలు అనంతరం ప్రీ ఫైనల్ పరీక్ష నిర్వహించాలి. ఒక్కో సబ్జెక్ట్‌కు 100 మార్కులు చొప్పున నిర్వహించాలి.

జిల్లాలో 335 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు

జిల్లాలో 335 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. వీటిల్లో 15 వేల మందికి పైగా విద్యార్థులు చదువుతున్నారు. పదో తరగతి పరీక్షలు ఏప్రిల్ 3 నుంచి 18వ తేదీ వరకు రాష్ట్ర ప్రభుత్వం షెడ్యూల్‌ను ప్రకటించింది. ఈ విద్యా సంవత్సరంలో పది విద్యార్థులకు పబ్లిక్ పరీక్షల్లో 6 పేపర్లు మాత్రమే ఉంటాయని రాష్ట్ర విద్యాశాఖ అధికారులు నిర్ణయించారు. దీంతో విద్యార్థులు పదిలో మెరుగైన ఫలితాలు సాధించే అవకాశం ఉంది. ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు సిలబస్ పూర్తి కాకుంటే ఈ నెలాఖరు కల్లా పూర్తిచేయాలని జిల్లా విద్యాశాఖ అధికారులు ఆదేశించారు.

మెరుగైన ఫలితాలు సాధనే లక్ష్యం

పదో తరగతిలో గతేడాది కంటే మెరుగైన ఫలితాలు సాధించాలనే ఉద్దేశంతో పురోగామి ప్రోగ్రాంను అమలు చేస్తున్నాం. మొత్తం 62 రోజుల పాటు ఈ ప్రోగ్రాంను నిర్వహించనున్నాం. అన్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో తప్పని సరిగా అమలు చేయాలి. చదువులో వెనుకబడిన విద్యార్థులను ఉపాధ్యాయులు దత్తత తీసుకుని వారు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు సహకారం అందించాలి.

– సుబ్బారావు, ఆర్జేడీ

భూ సేకరణపై ఉన్నతస్థాయి సమావేశం

- 4 వేల ఎకరాల భూసేకరణపై అధికారులతో కలెక్టర్ సమీక్ష

కందుకూరు: పారిశ్రామికాభివృద్ధిలో భాగంగా గుడ్లూరు మండలంలోని రావూరు, చేవూరు గ్రామాల్లో చేపట్టిన భూ సేకరణపై కలెక్టర్ చక్రధర్‌బాబు ఆదివారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ రెండు గ్రామాల్లో 'ఇండోసోల్ అనే సోలార్ ప్యానల్స్' తయారీ కంపెనీ భారీ పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చింది. ఈ పరిశ్రమ ఏర్పాటుకు దాదాపు 4 వేల ఎకరాల భూములు అవసరమవుతాయని గుర్తించారు. ఈ మేరకు రావూరు, చేవూరు గ్రామాల పరిధిలో అవసరమైన భూసేకరణ చేసేందుకు అధికారులు ప్రయత్నం చేస్తున్నారు. అయితే పరిహారం విషయంలో కొందరు రైతులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆదివారం ఆ రెండు గ్రామాల నుంచి కొందరు ప్రతినిధులను ఆహ్వానించి కలెక్టర్ చర్చలు చేశారు. రైతుల అభ్యంతరాలను పరిగణలోకి తీసుకుంటామని, పరిహారం విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చినట్లు రైతుల ప్రతినిధులు తెలిపారు. భూ సేకరణకు తీసుకోవాల్సిన చర్యలు, గ్రామాల ప్రజలు ప్రధానంగా ఏ అంశాలపై అభ్యంతరం చెబుతున్నారనే విషయాలను అధికారులతో చర్చించారు. అనంతరం కలెక్టర్ విలేకరులతో మాట్లాడుతూ రావూరు, చేవూరు గ్రామాలకు సంబంధించి 8 మంది ప్రతినిధులతో ఒక కమిటీని ఏర్పాటు చేశామన్నారు. భూ సేకరణకు సంబంధించి గ్రామాల ప్రజలతో సమన్వయం చేసుకునేందుకు ఈ కమిటీ పని చేస్తుందన్నారు. భూముల కోల్పోతున్న ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా చూస్తామని స్పష్టం చేశారు. సమావేశంలో ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి, జేసీ కూర్మనాథ్, భూసేకరణ డిప్యూటీ కలెక్టర్ పద్మావతి, లైజనింగ్ ఆఫీసర్ ఐవీరెడ్డి, రామాపట్నంపోర్టు సీఈఓ ప్రతాప్‌రెడ్డి, ఇన్‌చార్జి ఆర్డీఓ శ్రీనానాయక్, ఇతర అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ చక్రధర్‌బాబు

అథ్లెటిక్స్‌లో నెల్లూరీయుడి సత్తా

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): శ్రీకాకుళంలో జరుగుతున్న 66వ రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ అండర్–19 పరుగు పందెంలో జిల్లాకు చెందిన విద్యార్థి 100 మీటర్ల పరుగు పందెంలో ఆదివారం సత్తా చాటారు. జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి పాటూరు వేణుగోపాల్‌రెడ్డి సమాచారం మేరకు.. విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఆర్ట్స్ కాలేజీ విద్యార్థి వి.హిమతేజ 11.16 సెకన్లలో పూర్తి చేసి రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానం సాధించారని ఆదివారం తెలిపారు. రాష్ట్ర స్థాయిలో ప్రతిష్టాత్మకమైన 100 మీటర్ల పరుగు పందెంలో నెల్లూరీయుడు ప్రథమ స్థానం సాధించడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.



హిమతేజను అభినందిస్తున్న వేణుగోపాల్‌రెడ్డి

దగ్గర దారి అని అడ్డదారిలో పట్టాలపై నడుచుకుంటూ మృత్యువుకు ఎదురెళ్లారు. రాజదారిలో వెళ్లి రోడ్డెక్కి ఉంటే సురక్షితంగా ఇళ్లకు చేరుకునే వారు. కొంచెం తొందర పాటు.. ఏమరపాటు.. నిర్లక్ష్యం.. క్షణకాలంలో మూడు నిండు ప్రాణాలు రైలు పట్టాలపై ఛిద్రమయ్యాయి. రైల్వే పార్శిల్ కార్యాలయం పక్కనే ఉన్న గేటు మూసివేయడమే వీరి మృత్యువుకు దారి అయింది. మూడు రోజుల పాటు దైవదర్శనాలతో ఆధ్యాత్మికానందం పొందిన ఆ వృద్ధ దంపతులు మరికొద్ది సేపట్లో ఇంటికి చేరుకుంటామనుకుంటే మధ్యలోనే విగతజీవులయ్యారు. పది నిమిషాల్లో ఇంటికి వస్తానని భార్యతో చెప్పిన గ్రామ సచివాలయ ఉద్యోగి ఐదు నిమిషాల్లోనే అనంతలోకాల్లో కలిసిపోయాడు. ఈ విషాదకర ఘటనతో ఆ కుటుంబాలు శోకసంద్రంలో మునిగిపోయాయి.

దగ్గర దారి అని..

- పట్టాలపై కడతేరిన ప్రాణాలు
- దైవదర్శనం చేసుకుని తిరిగొచ్చిన దంపతులు
- ఉద్యోగానికి వెళ్లి తిరిగి వస్తూ..
- రైలు ఢీకొన్న ప్రమాదంలో మృతులు నెల్లూరు వాసులే
- శోకసంద్రంలో మృతుల కుటుంబాలు

నెల్లూరు (క్రైమ్): నెల్లూరు రైల్వేస్టేషన్ దక్షిణం వైపు ఆత్మకూరు బస్టాండ్ అండర్ బ్రిడ్జిపై శనివారం రాత్రి రైలు ఢీకొన్న ప్రమాదంలో దుర్మరణం పాలైన ముగ్గురూ నెల్లూరు వాసులు గుర్తించారు. రైలు దిగి స్టేషన్‌లో నుంచి బయటకు వచ్చేందుకు రైల్వే పార్శిల్ ఆఫీసు గేటు దారి మూసివేసి ఉంచడంతో దగ్గర దారి అని ఆత్మకూరు బస్టాండ్ వెనుక పక్క నక్కలోళ్ల వీధిలో నుంచి రోడ్డు మీదుకు వెళ్లొచ్చని నడుచుకుంటూ రైలు పట్టాపై వెళ్లారు. బస్టాండ్ అండర్ బ్రిడ్జి వద్ద మలుపు ఉండడంతో రైలు విషయం గమనించకపోవడంతో ధర్మవరం నుంచి నర్సాపురం వెళ్తున్న నర్సాపూర్ ఎక్స్‌ప్రెస్ ఎదురుగా ఢీకొన్న విషయం విదితమే. మృతుల వద్ద లభ్యమైన ఆధార్‌కార్డుల ఆధారంగా వారంతా నెల్లూరు వాసులేనని పోలీసులు గుర్తించారు.

దైవదర్శనం చేసుకుని వచ్చి...

ప్రమాదంలో మృతి చెందిన నెల్లూరు నగరంలోని ముత్యాలపాళెంకు చెందిన గుండెబోయిన పోలయ్య (75), గుమ్మడి సుగుణమ్మ (75) దంపతులు. పోలయ్య విశ్రాంత ప్రిన్సిపల్, సుగుణమ్మ విశ్రాంత అధ్యాపకురాలు. వీరికి శిరీష, శిల్ప కుమార్తెలు. వారిద్దరికి వివాహాలు అయ్యాయి. శిరీష జీజీహెచ్‌లో కంటి వైద్యురాలిగా పని చేస్తుండగా, చిన్నకుమార్తె గృహిణి. పోలయ్య, సుగుణమ్మ దంపతులు ఈ నెల 18న ఒంటిమిట్టకు వెళ్లారు. అక్కడి నుంచి తిరుమలకు వెళ్లారు. అక్కడ వెంకటేశ్వరస్వామిని దర్శించుకుని శనివారం శేషాద్రి ఎక్స్‌ప్రెస్‌లో నెల్లూరు ప్రధాన రైల్వేస్టేషన్ చేరుకున్నారు.



శనివారం రాత్రి ప్రమాద స్థలిని పరిశీలిస్తున్న రైల్వే ఎస్‌ఐ, సంతపేట ఇన్‌స్పెక్టర్

పది నిమిషాల్లో వస్తున్నా..

రైలు పడుగుపాడుకు వచ్చింది.. మరో పది నిమిషాల్లో ఇంటికి వస్తానని తెన్నేటి సరస్వతీరావు (46) భార్యకు ఫోన్ చేసి చెప్పాడు. నెల్లూరు ప్రధాన రైల్వేస్టేషన్‌లో దిగిన సరస్వతీరావు ఇంటికి తొందరగా వెళ్లాలని అడ్డదారిలో వెళ్తూ మృత్యువు ఒడికి చేరుకున్నాడు. నెల్లూరు కరెంట్ ఆఫీసు సెంటర్ సమీపంలోని రిత్విక్ ఎన్‌క్లేవ్‌లో నివాసం ఉంటున్న సరస్వతీరావు పూర్వం కృష్ణా జిల్లా, ప్రస్తుతం ఏలూరు జిల్లాలోని నందివాడ మండలం పుట్టగుంట గ్రామ సచివాలయంలో ఎడ్యుకేషన్ సెక్రటరీగా విధులు నిర్వర్తిస్తున్నాడు. అతని భార్య ఝాన్సీరాణి నెల్లూరు జీజీహెచ్‌లో స్టాఫ్‌నర్స్‌గా పని చేస్తోంది. సరస్వతీరావు ప్రతి రోజు విజయవాడకు విక్రమ సింహపురికి వెళ్లి విధులు నిర్వర్తించి అదే రైల్లో తిరిగి వచ్చేవాడు. శనివారం రాత్రి విజయవాడ నుంచి విక్రమసింహపురి ఎక్స్‌ప్రెస్‌లో వచ్చి నెల్లూరు ప్రధాన రైల్వే స్టేషన్‌లో రైలు దిగారు.




పోలయ్య, సుగుణమ్మ (ఫైల్ ఫొటోలు)



సరస్వతీరావు (ఫైల్)

ఆలస్యం అవుతుందని..

రైల్వే స్టేషన్ నుంచి బయటకు రావాలంటే స్టేషన్‌లోకి వెళ్లి అండర్ గ్రౌండ్ నుంచి కానీ, ఫుట్‌ఓవర్ బ్రిడ్జిపై నుంచి బయటకు వచ్చేందుకు మార్గాలు ఉన్నాయి. రైల్వే పార్శిల్స్ రవాణా చేసేందుకు దక్షిణ వైపు ప్లాట్‌ఫాం చివర దారి ఉంది. ఈ దారి ఆత్మకూరు బస్టాండ్ వద్దకు చేరుకునేందుకు దగ్గరగా ఉంటుంది. అలాగే అనుకుని గుండెబోయిన పోలయ్య, గుమ్మడి సుగుణమ్మ, తెన్నేటి సరస్వతీరావు ముందుస్తు ఆలోచనతోనే ఇక్కడ దిగే విధంగా రైల్లో ఎక్కి వచ్చారు. తీరా స్టేషన్‌లో రైలు దిగే సమయానికి రైల్వే పార్శిల్స్ రవాణా చేసే గేటు మూసి ఉంది. బయటకు వెళ్లాంటే తిరిగి మళ్లీ వెనక్కి వెళ్తే 10 నిమిషాలకుపైగా సమయం పడుతుందని, ఆత్మకూరు బస్టాండ్ రైల్వే అండర్ బ్రిడ్జి మీదుగా నడుచుకుంటూ అవతలి పక్కన దిగి ఆటోలో వెళ్లాలనుకున్నారు. దీంతో వారు సిగ్నల్స్‌ను గమనించకుండా రైల్వేస్టేషన్ నుంచి రైలు పట్టాలపై నడుచుకుంటూ బయలుదేరారు.

కబళించిన మృత్యువు

ఆత్మకూరు బస్టాండ్ అండర్ బ్రిడ్జి మీదుగా వెళుతుండగా నర్సాపురం ఎక్స్‌ప్రెస్ వారిని వేగంగా ఢీకొంది. పోలయ్య, సరస్వతీరావు రైలు పట్టాలపైనే విగత జీవులు కాగా సుగుణమ్మ బ్రిడ్జిపై నుంచి కిందపడి మృతి చెందారు. ఘటనపై లోకో పైలెట్ స్టేషన్‌లో తెలియజేశారు. సమాచారం అందుకున్న నెల్లూరు రైల్వే ఎస్‌ఐ ఎన్. హరిచందన, సంతపేట ఇన్‌స్పెక్టర్ షేక్ అన్వర్‌బాషా హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను జీజీహెచ్ మార్చురీకి తరలించారు. మృతదేహాలను, వారి బ్యాగ్‌లను పరిశీలించగా అందులో ఆధార్‌కార్డులు, ఐడీ కార్డులు లభ్యం కావడంతో వాటి ఆధారంగా బాధిత కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. బాధిత కుటుంబ సభ్యులు మార్చురీ వద్దకు చేరుకుని కన్నీరు మున్నీరయ్యారు. వారి కుటుంబాల్లో విషాదఛాయలు అలముకున్నాయి. ఎస్‌ఐ హరిచందన కేసు నమోదు చేశారు. ఆదివారం నెల్లూరు రైల్వే డీఎస్పీ పి. మల్లికార్జునరావు, సీఐ శ్రీనివాసాచారి జీజీహెచ్‌కు చేరుకుని వివరాలను సేకరించారు. ప్రభుత్వ వైద్యులు మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించి బాధిత కుటుంబ సభ్యులకు అప్పగించారు.

బాధ్యతగా ఉందాం

- మానవ తప్పిదాలు, నిర్లక్ష్యంతోనే ప్రమాదాలు
- జిల్లాలో రహదారి భద్రతా వారోత్సవాలు
- అవగాహన కల్పిస్తున్న పోలీస్, రవాణా శాఖ అధికారులు



వాహనచోదకులకు అవగాహన కల్పిస్తున్న నెల్లూరు నార్త్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వరమ్మ

నెల్లూరు(క్రైమ్): మితిమీరిన వేగం.. నిబంధనల ఉల్లంఘన.. వాహనచోదకుల నిర్లక్ష్య ధోరణి తదితరాలు రోడ్డు ప్రమాదాలకు కారణాలవుతున్నాయి. పలువురు ప్రాణాలు కోల్పోతుండగా మరెందరో క్షతగాత్రులవుతున్నారు. వారిపై ఆధారపడిన కుటుంబాలు చిన్నాభిన్నమవుతున్నాయి. ప్రమాదాల్లో మరణిస్తున్న వారిలో కుటుంబపెద్దలు, యువకులే అధికంగా ఉంటున్నారు. మానవ తప్పిదాలే అధికశాతం ప్రమాదాలకు కారణమని పోలీసు, రవాణా శాఖ అధికారులు వెల్లడిస్తున్నారు. ఎప్పటికప్పుడు నిబంధనలను కఠినతరం చేస్తున్నా కొందరు వాహనదారుల్లో మార్పు రావడం లేదు. జిల్లాలో ప్రస్తుతం రహదారి భద్రతా వారోత్సవాలు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఆయా శాఖల అధికారులు రహదారి భద్రత, నియమాలపై విస్తృతంగా అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

పాదచారులు ఏమి చేయాలంటే..

రోడ్డుకు ఎడమ వైపునే ఫుట్‌పాత్ మీదే నడవాలి. జీబ్రా క్రాసింగ్‌లున్న చోటే రోడ్డును దాటాలి. మలుపుల వద్ద రోడ్డు దాటే సమయంలో జాగ్రత్తలు పాటించాలి. ఫుట్‌పాత్ లేనిచోట నడిచేటప్పుడు ట్రాఫిక్‌ను గమనించాలి.

వాహనదారులు

డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా కలిగి ఉండాలి. ద్విచక్ర వాహనాలు నడిపేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి. మద్యం తాగి వాహనాలు నడపకూడదు. వన్‌వేలో వెళ్లకూడదు. బైక్‌పై ఇద్దరికి మించి ప్రయాణం చేయరాదు. మలుపుల వద్ద తప్పనిసరిగా సిగ్నల్స్ ఇవ్వాలి. వాహనాలు నడిపే సమయంలో ఫోన్ చూడడం, మ్యూజిక్ వినడం లాంటి పనులు చేయొద్దు.

సంవత్సరం	జరిగిన ప్రమాదాలు	మృతులు	క్షతగాత్రులు
2020	943	398	944
2021	977	466	1,006
2022	884	368	974

ఆటో డ్రైవర్లు

పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోరాదు. స్టేజ్ క్యారేజీలుగా తిప్పకూడదు. డ్రైవర్ సీట్లో ఎవరినీ కూర్చోనివ్వరాదు. స్కూల్ పిల్లలను ఎక్కువ సంఖ్యలో ఎక్కించి బ్యాగ్‌లను బయటకు వేలాడదీయకూడదు. వాహనానికి ఫిట్‌నెస్ తప్పనిసరి.

స్కూల్ బస్సు డ్రైవర్లు

స్కూల్ బస్సులను నడిపే డ్రైవర్లకు మూడేళ్ల అనుభవం తప్పనిసరి. హెవీ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలి. ప్రతి బస్సులో ఫైర్ సిస్టం, ఫస్ట్ ఎయిడ్ కిట్, ఎగ్జిట్ సౌకర్యాలుండాలి.
కండీషన్‌లో ఉన్న బస్సులనే వినియోగించాలి. పరిమితికి మించి విద్యార్థులను ఎక్కించుకోకూడదు. బస్సులో ఒకరు లేదా ఇద్దరు ఉపాధ్యాయులు ఉండేలా చర్యలు తీసుకోవాలి.

ఇలా చేస్తే..

- సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపుతుండడంతో ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయి. వాహనం నడిపే సమయంలో సెల్‌ఫోన్‌లో మాట్లాడే అలవాటుకు దూరంగా ఉండాలి. అత్యవసరమైన కాల్ అయితే వాహనాన్ని పక్కకు ఆపాలి.
- మద్యం తాగి వాహనాలు నడిపితే వారితోపాటు ఇతరులకు ప్రమాదాలు జరుగుతుంటాయి. ముఖ్యంగా యువత ఈ విషయంలో జాగ్రత్త వహించాలి.
- పదో తరగతి, ఇంటర్మీడియట్ చదివే బాలురు, బాలికలు సరదాకు వాహనాలు నడుపుతుండడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. తల్లిదండ్రులు ప్రత్యేకశ్రద్ధ చూపాలి. మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదు.
- ద్విచక్ర వాహనదారులు వాహనచోదన సమయంలో విధిగా హెల్మెట్, కార్లు నడిపేవారు, ప్రయాణించేవారు తప్పనిసరిగా సీట్‌బెల్ట్ పెట్టుకోవాలి. దీంతో ప్రమాద తీవ్రతను తగ్గించవచ్చు.
- రోడ్డు ప్రమాదాల్లో అధికశాతం మితిమీరిన వేగంతోనే జరుగుతున్నాయి. వాహనం నడిపే ప్రతిఒక్కరూ నిబంధనలు పాటిస్తూ ఓవర్‌స్పీడ్ డ్రైవింగ్‌కు దూరంగా ఉండాలి.

ఈ పత్రాలు తప్పనిసరి

రవాణేతర వాహనాలకు సంబంధించి రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్, వాహన బీమా పాలసీ, డ్రైవింగ్ లైసెన్స్, కాలుష్య తనిఖీ పత్రం చోదకుల వద్ద ఉండాలి. రవాణా వాహనాలకు సంబంధించి పై పత్రాలతోపాటు పన్ను కట్టిన రసీదు, పర్మిట్ పత్రం, ఫిట్‌నెస్ సర్టిఫికెట్ ఉండాలి. లేదంటే జరిమానా విధిస్తారు.

తీసుకున్న చర్యలు

రోడ్డు ప్రమాదాల నివారణకు ఆయా శాఖల అధికారులు పటిష్ట చర్యలు చేపట్టారు. జిల్లా వ్యాప్తంగా జాతీయ, రాష్ట్ర రహదారుల్లో ప్రమాదాలు అధికంగా జరిగే ప్రాంతాలు (బ్లాక్‌స్పాట్లు గుర్తించి సైన్‌బోర్డులు ఏర్పాటు చేశారు. ఫేస్ వాష్ అండ్ గో కార్యక్రమాన్ని ప్రారంభించారు. విజిబుల్ పోలీసింగ్ నిర్వహిస్తున్నారు.

గతేడాదిలో..

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు : **1,342**

మూడురోజుల జైలుశిక్ష పడింది : **25** మందికి..

హెల్మెట్ ధరించని వారిపై నమోదైన కేసులు : **69,025**

సీట్‌బెల్ట్ ధరించని వారిపై : **564**

రాంగ్ పార్కింగ్‌పై పెట్టిన కేసులు **35,808**

రాంగ్ డ్రైవింగ్‌పై.. : **5,417**,

ఓవర్‌లోడ్‌తో వెళ్తున్న వాహనాలపై పెట్టిన కేసులు : **2,810**

పరిమితికి మించి ప్రయాణికులను తీసుకెళ్తున్న వాహనాలపై : **529** కేసులు

నిబంధనలు పాటించాలి



జీవితం చాలా విలువైంది. వేగం కన్నా.. ప్రాణం మిన్న. ప్రతి వ్యక్తి వారి కుటుంబానికి ఎంతో ముఖ్యమన్న విషయాన్ని నిత్యం గమనంలో ఉంచుకోవాలి. వాహనాలు నడిపే సమయంలో విధిగా హెల్మెట్, సీట్‌బెల్ట్ ధరించాలి. రోడ్డు నిబంధనలు విధిగా పాటించాలి. మైనర్లకు బైక్‌లిచ్చే తల్లిదండ్రులపై చర్యలు తప్పవు. జిల్లా వ్యాప్తంగా అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. విజిబుల్ పోలీసింగ్ సత్ఫలితాలిస్తోంది.
– సీహెచ్ విజయారావు, ఎస్పీ

హోరాహోరీగా రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలు



అండర్-17 పోటీలో తలపడుతున్న బాలికలు



పోటీ పడుతున్న బాలురు

- సెమీఫైనల్‌కు నెల్లూరు జట్లు

ఆత్మకూరు: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలు హోరాహోరీగా జరుగుతున్నాయి. అండర్-14, అండర్-17 విభాగాల్లో శనివారం ప్రారంభమైన ఈ టోర్నమెంట్‌లో 12 జిల్లాలకు చెందిన 580 మంది క్రీడా విద్యార్థులు పాల్గొంటున్నారు. ఆదివారం అండర్-14 బాలుర విభాగంలో నెల్లూరు జిల్లా జట్టు వెస్ట్ గోదావరి జిల్లా జట్టుపై 6-4 గోల్స్ తేడాతో, అండర్ 17 బాలికల విభాగంలో నెల్లూరు జట్టు వైఎస్సార్ జట్టుపై 13-10 గోల్స్ తేడాతో విజయం సాధించి సెమీస్‌కు చేరుకుంది. అండర్-17 బాలుర విభాగంలో నెల్లూరు జిల్లా జట్టు చిత్తూరు జిల్లా జట్టుపై 22-4 గోల్స్ తేడాతో గెలిచి క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకున్నట్లు పీఈటీ తిరుపతయ్య వివరించారు. గెలుపొందిన జట్లకు సోమవారం ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి చేతుల మీదుగా బహుమతి ప్రదానం చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆత్మకూరు లాంటి ప్రాంతంలో రాష్ట్ర స్థాయి టోర్నమెంట్‌లు నిర్వహించడం ఆనందంగా ఉందని పట్టణ ప్రముఖులు చెబుతున్నారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్) : 122
బ్రాయిలర్ చికెన్ : 214
లేయర్ చికెన్ : 162
లేయర్ (లైవ్) : 95
బ్రాయిలర్ స్కిన్‌లెస్ : 238

పొదలకూరు నిమ్మధరలు (కిలో)

పెద్దవి: రూ.30
సన్నవి: రూ.18
పండ్లు: రూ.7

క్లుప్తంగా

పురుగుమందు తాగి వ్యక్తి ఆత్మహత్య

మర్రిపాడు: మండలంలోని నందవరం గ్రామానికి చెందిన దాసరి లక్ష్మీనారాయణ (42) అనే వ్యక్తి పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మర్రిపాడు పోలీసుల కథనం మేరకు.. నందవరం గ్రామానికి చెందిన లక్ష్మీనారాయణ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈక్రమంలో శనివారం పురుగుమందు తాగాడు. కుటుంబసభ్యులు గుర్తించి ఆయన్ను నెల్లూరులోని వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. ఫిర్యాదు అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక



కబడ్డీ పోటీలకు ఎంపికైన విద్యార్థినులు

ఉలవపాడు: రాష్ట్రస్థాయి అండర్-17 కబడ్డీ పోటీలకు మండలంలోని పెదపట్టపుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థినులు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు రమణయ్య తెలిపారు. ఆయన ఆదివారం వివరాలు వెల్లడించారు. పదో తరగతి చదువుతున్న ఆవుల శాంతి, ఆవుల సాయిశ్రీ, వాయల శశిరేఖలు రాష్ట్రస్థాయి పోటీల్లో ఉమ్మడి ప్రకాశం జిల్లా జట్టులో ఆడనున్నారు. గత నెలలో మార్కాపురం డివిజన్ గద్దలగుంట వద్ద జరిగిన ఎంపికల్లో వీరు ప్రతిభ చూపారు. ఈనెల 23, 24, 25 తేదీల్లో విజయనగరంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారు. ఎంపికైన విద్యార్థినులను, వ్యాయామ అధ్యాపకుడు ప్రభాకర్‌ను హెచ్ఎం, పాఠశాల సిబ్బంది, గ్రామస్తులు అభినందించారు.

సీఎం వైఎస్ జగన్‌కు ప్రజల ఆశీస్సులు

- ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి
- సంగంలో గాంధీ, అమరజీవి విగ్రహాల ఆవిష్కరణ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి, పక్కన ద్వారకానాథ్

సంగం: రాష్ట్రాభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజల ఆశీస్సులు మెండుగా ఉన్నాయని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రమైన సంగంలో ఏర్పాటు చేసిన మహాత్మా గాంధీ, అమరజీవి పొట్టి శ్రీరాముల విగ్రహాలను ఆదివారం ఆయన, నుడా చైర్మన్ ముక్కాల ద్వారకానాథ్, ఆర్యవైశ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజా ప్రతినిధులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహోన్నత వ్యక్తులైన గాంధీ, అమరజీవి విగ్రహాలను ఆవిష్కరించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. పారిశ్రామికవేత్తగా అనేక రాష్ట్రాల్లో పర్యటించానన్నారు. ఏ ముఖ్యమంత్రి అందించలేని స్థాయిలో మన సీఎం వైఎస్ జగన్ పేదలకు సంక్షేమం, అభివృద్ధి ఫలాలను అందిస్తూ దేశానికే రోల్‌మోడల్‌గా నిలుస్తున్నారని చెప్పారు.

ఆర్యవైశ్యులకు అండగా జగనన్న

ద్వారకానాథ్ మాట్లాడుతూ ఆర్యవైశ్యులకు సీఎం జగనన్న అండగా ఉన్నారన్నారు. ఏ నాయకుడు అమరజీవి పేరును నెల్లూరు జిల్లాకు పెట్టలేదని, దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఆ పేరు పెట్టి ఆర్యవైశ్యుల మదిలో నిలిచిపోయారన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తండ్రి బాటలో నడుస్తూ ఆర్యవైశ్యుల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం వైఎస్సార్‌సీపీ నాయకులు కంటాబత్తిన రఘునాథరెడ్డి, కర్నాటి రవీంద్రారెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు కె.సుబ్రహ్మణ్యం, మండలాధ్యక్షుడు గునిపూడి రాజశేఖర్, అనిల్, జిల్లా ఉపాధ్యక్షులు వేమా మల్లికార్జున, గుడిపూడి గిరి, లీగల్ సెల్ అధ్యక్షుడు వేణుగోపాల్, యువజన విభాగం కార్యదర్శి శ్రీరాం, భారతి సిమెంట్ ట్రేడర్స్ రమేష్, జెడ్పీటీసీ సభ్యురాలు రావుల లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీపై వ్యాపారులకు అవగాహన

- ఏపీ చాంబర్స్ అధ్యక్షుడు కృష్ణప్రసాద్

నెల్లూరు(బారకాసు): జీఎస్టీపై వ్యాపారులు అవగాహన కలిగి ఉండేందుకు సదస్సులు నిర్వహిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఫెడరేషన్ (ఏపీ చాంబర్స్) రాష్ట్ర అధ్యక్షుడు పైడా కృష్ణప్రసాద్ తెలిపారు. ఫెడరేషన్ రాష్ట్ర డైరెక్టర్ కోట గురుబ్రహ్మం ఆధ్వర్యంలో నెల్లూరులోని ఓ ప్రముఖ హోటల్లోని సమావేశ మందిరంలో జీఎస్టీపై అవగాహన సదస్సును ఆదివారం నిర్వహించారు. దీనికి కృష్ణప్రసాద్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకొచ్చిన చట్టాలపై అనేకమంది వ్యాపారులకు అవగాహన లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. వీటిని అధిగమించేందుకే ఫెడరేషన్ ద్వారా సదస్సులు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రభుత్వానికి – వ్యాపారస్తులకు మధ్య వారధిగా ఫెడరేషన్ పనిచేస్తుందన్నారు. ముఖ్యమైన సమస్యలను పరిష్కరించడం, వ్యాపార అవకాశాలను గుర్తించడం వంటి విషయాలపై అవిశ్రాంత కృషి చేస్తోందన్నారు. దేశంలో జీఎస్టీని ప్రవేశపెట్టిన తర్వాత జీఓ నంబర్ 183 ద్వారా వ్యాపారస్తులకు కొంత వెసులుబాటు కలిగిందన్నారు. అదేవిధంగా ప్రభుత్వాలు తీసుకొస్తున్న చట్టసవరణలు, కొత్త చట్టాలపై సభ్యులకు అవగాహన కల్పించనున్నామన్నారు. ప్రభుత్వాలకు సకాలంలో పన్నులు చెల్లించే విధంగా చూడాలని కోరారు. అదేవిధంగా వాణిజ్యరంగంలో వ్యాపారులకు ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకొస్తే వాటిని ప్రభుత్వానికి తెలియజేసి పరిష్కారం కోసం కృషి చేస్తామన్నారు. సదస్సులో ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్, ట్రెజరర్ అక్కయ్య నాయుడు, ప్రోగ్రాం కో–ఆర్డినేటర్లు కొట్టే రామ్మూర్తి, ఎస్వీ ప్రసాద్, ఆడిటర్ చుండూరు సుధీర్, సభ్యులు, వ్యాపారస్తులు పాల్గొన్నారు.



అతిథులను సత్కరిస్తున్న దృశ్యం

ప్రశాంతంగా ప్రిలిమినరీ రాత పరీక్ష



అభ్యర్థులను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్న పోలీసులు



ఐడీకార్డులను పరిశీలిస్తున్న పోలీసులు



డీకేడబ్ల్యూలో వివరాలు తెలుసుకుంటున్న ఎస్పీ విజయారావు

- 1,401 మంది గైర్హాజరు
- పలు కేంద్రాలను తనిఖీ చేసిన ఎస్పీ విజయారావు

నెల్లూరు (క్రైమ్): పోలీసు కానిస్టేబుల్స్ ప్రిలిమినరీ రాత పరీక్ష ఆదివారం జిల్లా వ్యాప్తంగా ప్రశాంతంగా జరిగింది. నెల్లూరు పరిధిలో 44, కావలి పరిధిలో 8 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. 20,951 మంది పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా 1,401 మంది గైర్హాజరైయ్యారు. 19,550 మంది పరీక్ష రాశారు. పరీక్షల్లో ఎలాంటి అవకతవకలు జరగకుండా ఎస్పీ సీహెచ్ విజయారావు ముందస్తు చర్యలు చేపట్టారు. పరీక్షా కేంద్రాల వద్ద భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. నగరంలోని డీకేడబ్ల్యూ, వీఆర్ పీజీ కళాశాల, గంగవరంలోని గీతాంజలి, వెంకటాచలంలోని క్యూబా ఇంజినీరింగ్ కళాశాలల్లోని పరీక్ష కేంద్రాలను ఎస్పీతో పాటు ఏఎస్పీలు డి.హిమవతి, ప్రసాద్, డీఎస్పీలు పరిశీలించారు. ఎస్పీ మఫ్టీలో మాగుంట లేవుట్‌లోని విశ్వసాయి (ఎస్ఆర్‌కే) కేంద్రానికి వెళ్లి బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు.

కేంద్రాల వద్ద హడావుడి

ఉదయం 7.30 గంటల నుంచే అభ్యర్థులతో పరీక్ష కేంద్రాల వద్ద హడావుడి నెలకొంది. ఉదయం 9 గంటల నుంచి అభ్యర్థులను క్షుణ్ణంగా తనిఖీలు చేసిన అనంతరం పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్ష జరిగింది. నిమిషం ఆలస్యమైనా కేంద్రాల్లోకి అనుమతించేది లేదని అధికారులు ప్రకటించిన నేపథ్యంలో అభ్యర్థులు నిర్దేశిత సమయానికే కేంద్రాల వద్దకు చేరుకున్నారు. కొందరు అభ్యర్థులు గుర్తింపు కార్డులను మరిచిపోవడంతో పోలీసు అధికారులే దగ్గరుండి తమ వాహనాల్లో వారిని ఇళ్లకు పంపి కార్డులు తెచ్చుకునేలా చేశారు. ప్రశాంత వాతావరణంలో పరీక్షలు నిర్వహించిన పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.